సాక్షి

అల్లూరి సీతారామరాజు జిల్లా

బుధవారం : 16 : ఆగస్టు : 2023



ప్రకృతి అందాలు అద్భుతం

ప్రముఖ పర్యాటక కేంద్రమైన బొర్రా గుహలు వద్ద ప్రకృతి అందాలు అద్భుతమని మంత్రి గుడివాడ అమర్‌నాథ్ పేర్కొన్నారు. 8లో



ఆదివాసీలు దేవుళ్లతో సమానం

గిరిజన ప్రాంతంలో నివసిస్తున్న ఆదివాసీలు దేవుళ్లతో సమానమ ని అరకులోయ ఎమ్మెల్యే శెట్టి పాల్గుణ అన్నారు. 8లో



సెల్ టవర్ పనులు ప్రారంభం

జి.మాడుగుల మండలం లువ్వాసింగి పంచాయతీ తియ్యగుండంలో సెల్ టవర్ పనులు ప్రారంభమయ్యాయి. 8లో

న్యూస్‌రీల్

నేడు పాడేరు, అరకులో వైఎస్సార్‌సీపీ సమావేశాలు

- హాజరు కానున్న రీజనల్ కోఆర్డినేటర్ సుబ్బారెడ్డి

సాక్షి, పాడేరు: పాడేరు, అరకులోయ నియోజక వర్గ కేంద్రాల్లో బుధవారం వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ స్థాయి సమావేశాలు నిర్వహిస్తున్నట్టు ఎమ్మెల్యేలు కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, చెట్టి పాల్గుణ తెలిపారు. వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి ఈ సమావేశాలకు ముఖ్య అతిథిగా హాజరవుతున్నారని వారు పేర్కొన్నరు. పాడేరులోని ఎస్పీ కార్యాలయానికి వెళ్లే ప్రధాన రోడ్డులో వీఆర్ కల్యాణ మండపంలో ఉదయం 10 గంటలకు పాడేరు నియోజకవర్గ సమావేశం జరుగుతుందన్నారు. అరకులోయలో నియోజకవర్గస్థాయి సమావేశం మధ్యాహ్నం రెండు గంటలకు అరకులోయలోని టూరిజంశాఖకు చెందిన పున్నమి గోష్టిలో నిర్వహిస్తున్నామన్నారు. నామినేటెడ్ పదవుల్లో ఉన్న పార్టీ నేతలు, అన్ని మండలాల ఎంపీపీలు, జెడ్పీటీసీలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ,గ్రామ సచివాలయాల కన్వీనర్లు, గృహసారధులు, పార్టీ అనుబంధ విభాగాల నేతలు నియోజకవర్గాల వారీగా జరిగే సమావేశానికి తప్పనిసరిగా హాజరు కావాలని వారు కోరారు.

ఎన్జీ రంగా వర్సిటీ పాలక మండలిలో ఎంపీకి స్థానం

- సభ్యురాలిగా మాధవి నియామకం



చింతపల్లి: ఆచార్య ఎన్‌జీరంగా వర్సిటీ పాలక మండలిలో అరకు ఎంపీ గొడ్డేటి మాధవికి సభ్యురాలిగా స్థానం లభించింది. ఆచార్య ఎన్‌జీరంగా విశ్వవిద్యాలయానికి పూర్తిస్థాయి పాలకమండలిని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ఉత్తర్వులు జారీచేసింది. రెండేళ్ల పాటు కొనసాగనున్న మండలిలో ఎంపీ మాధవికి అవకాశం దక్కింది. ఈమె నియామకంగతో స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం మరింత ప్రగతి సాధించే అవకాశం ఉంది.

పేద విద్యార్థులకు ఆదర్శం చంద్రలేఖ

- పలువురి అభినందన



చంద్రలేఖను సత్కరిస్తున్న ఎంపీపీ తదితరులు

ఎటపాక: ఐరాస సదస్సుకు ఎంపికైన మోతుకూరి చంద్రలేఖ పేద విద్యార్థులకు ఆదర్శంగా నిలిచిందని పలువురు పేర్కొన్నారు. మంగళవారం ఎటపాకలో చంద్రలేఖను ఎంపీపీ కాక కామేశ్వరి, ఎంఈవో నీలి బాలరాజు, వెలుగు ఏపీఎం స్వామి ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. పేద కుటుంబంలో జన్మించి కస్తూర్బా బాలికల విద్యాలయంలో చదువుతూ ఎటపాకకు గుర్తింపు తేవడం అభినందనీయమని వారు కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ వర్స బాలకృష్ణ, ఆర్ఐ బాపిరాజు, రమేష్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కొయ్యూరులో భారీ వర్షం



కురుస్తున్న వర్షం

కొయ్యూరు:మండలంలో మంగళవారం భారీ వర్షం కురిసింది. సుమారు 40 నిమిషాల పాటు వర్షం పడింది. దీంతో పంటపొలాల్లోకి నీరు చేరింది. ఈ వర్షం వ్యవసాయ పనులకు అనుకూలంగా ఉంటుందని రైతులు తెలిపారు. దుక్కులు దున్ని అపరాలు వేసేందుకు అన్నదాతలు సిద్ధమవుతున్నారు.

గురుకులానికి గ్రైండర్లు అందజేత



గ్రైండర్లు అందజేస్తున్న శివరామరాజు, చిరంజీవి

కొయ్యూరు: స్థానిక గురుకుల పాఠశాలకు మంపకు చెందిన బి.శివరామరాజు, కొయ్యూరుకు చెందిన అనిశెట్టి చిరంజీవి కలిసి రెండు గ్రైండర్లను అందజేశారు. ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు,వైస్ ప్రిన్సిపాల్ మోహన్‌కు వీటిని అందజేశారు.



ప్రథమ స్థానం పొందిన డీఆర్‌డీఏ కళ్యాణమస్తు శకటం



నృత్యంలో మొదటి స్థానం పొందిన పాడేరు కేజీబీవీ విద్యార్థినులు



రంపచోడవరంలో జెండా ఎగురవేస్తున్న ఎమ్మెల్యే ధనలక్ష్మి



పాడేరులో గౌరవ వందనం స్వీకరిస్తున్న ఎస్పీ తుహిన్‌సిన్హా

గిరిలో ప్రగతి పరుగులు

- ప్రత్యేక జిల్లా ఏర్పాటుతో పూర్తిస్థాయిలో అభివృద్ధి
- గిరిజనాభివృద్ధికి ప్రత్యేక నిధులు
- స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల్లో జిల్లా ఇన్‌చార్జి మంత్రి గుడివాడ అమర్‌నాథ్
- అమరవీరులకు ఘన నివాళి
- ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు
- ప్రత్యేక ఆకర్షణగా సాహస విన్యాసాలు



పాడేరులో స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల్లో గౌరవ వందనం స్వీకరిస్తున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్

సాక్షి,పాడేరు: గిరి సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధిక ప్రాధాన్యమివ్వడంతో జిల్లా ప్రగతిపథంలో నడుస్తోందని జిల్లా ఇన్‌చార్జి, పరిశ్రమలు, ఐటీశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ పేర్కొన్నారు. స్థానిక తలారిసింగి పాఠశాల మైదానంలో 77వ స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. జాతీయ జెండాను ఆయన ఆవిష్కరించి, గౌరవ వందనం స్వీకరించారు. స్వాతంత్య్ర పోరాటంలో అమరవీరులకు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు, అనుచరులు గాంగంటందొర, మల్లుదొర, స్వాతంత్య్ర సమరయోధులు మర్రి కామయ్య, పండుపడాల్ వంటి వీరుల త్యాగ ఫలితంగానే స్వేచ్ఛా వాయువులను పీల్చుతున్నామన్నారు.

ప్రజా సంక్షేమే అజెండాగా పాలన

ప్రజల సంక్షేమమే అజెండాగా పాలనలో ముఖ్యమంత్రి విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారన్నారు. గిరిజన ప్రాంత సంక్షేమమే లక్ష్యంగా పాడేరు కేంద్రంగా జిల్లాను ఏర్పాటు చేశారని మంత్రి పేర్కొన్నారు. నాలుగేళ్ల పాలనలో జిల్లాలోని 22 మండలాల్లో సంపూర్ణ ప్రగతి లక్ష్యంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. గిరిజన ప్రజలకు ఉన్నత వైద్యం అందుబాటులోకి తెచ్చే లక్ష్యంగా రూ.500 కోట్లతో పాడేరులో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఏర్పాటుచేసిన వైద్య కళాశాల పనులు త్వరలోనే పూర్తికానున్నాయన్నారు. మైదాన ప్రాంత జిల్లాలకు సంబంధించి సచివాలయానికి రూ.20 లక్షల మంజూరు చేయగా, అల్లూరి జిల్లాకు మాత్రం ప్రత్యేకంగా రూ.40లక్షల నిధులను కేటాయించడం గిరిజన ప్రాంత అభివృద్ధిపై ముఖ్యమంత్రి ప్రత్యేకశ్రద్ధ స్పష్టమవుతోందన్నారు.

అధికారులకు అభినందన

వరద ప్రాంతాల్లో సహాయక కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించిన కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎస్పీ తుహిన్‌సిన్హా, చింతూరు ఐటీడీఏ పీవో సూరజ్‌గనోరే, ఇతర అధికారులు, పోలీసులు, అన్నిశాఖల యంత్రాంగానికి మంత్రి అమర్‌నాథ్ ప్రత్యేక అభినందనలు తెలిపారు.విద్యార్థుల నృత ప్రదర్శనలు, సాహస విన్యాసాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. విధి నిర్వహణలో ఉత్తమ సేవలు అందించిన జిల్లాలోని 300మంది అధికారులు, ఉద్యోగులకు మంత్రి అమర్‌నాథ్ ఉత్తమ సేవా ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎస్పీ తుహిన్‌సిన్హా, జాయింట్ కలెక్టర్ శివశ్రీనివాస్, ఐటీడీఏ పీవో వి.అభిషేక్, పాడేరు, అరకు ఎమ్మెల్యేలు కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి,చెట్టి పాల్గుణ,ఏపీ మెడికల్ కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ తమర్బ నరసింగరావు, చింతలవీధి సర్పంచ్ వంతాల సీతమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు గిడ్డి విజయలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నేత తెడబారికి సురేష్‌కుమార్ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

విద్యార్థినీ విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. దేశభక్తి గీతాలకు విద్యార్థులు ప్రదర్శించిన నృత్య రూపకాలు ఆకట్టుకున్నాయి. కొయ్యూరు ఆశ్రమ పాఠశాల విద్యార్థులు మళ్ల విద్యను ప్రదర్శించారు. బాలబాలికలు వేర్వేరుగా ప్రదర్శించిన మళ్ల కంబ విన్యాసాలు అలరించాయి. తలారిసింగి ఆశ్రమ పాఠశాల విద్యార్థులు ఫైర్ జంప్‌తో సందడి చేశారు. నృత్యపోటీల్లో పాడేరు కేజీబీవీ పాఠశాల విద్యార్థినులు ప్రథమస్థానం, తలారిసింగి ఆశ్రమ పాఠశాల విద్యార్థులు ద్వితీయస్థానం సాధించారు. అలాగే విన్యాసాలు, ఇతర ఫైర్ జంప్‌లలో పలు పాఠశాలల విద్యార్థులు ప్రతిభ చూపారు. విజేతలకు జ్ఞాపికలు అందజేశారు. శకటాల్లో ఉత్తమ ప్రదర్శనగా డీఆర్‌డీఏ కల్యాణమస్తు , ద్వితీయస్థానంలో వ్యవసాయ, ఉద్యానవన శాఖ, తృతీయస్థానాల్లో విద్యాశాఖ శకటాలు నిలిచాయి. వీరిలో జ్ఞాపికలు అందజేశారు.

త్యాగమూర్తుల స్ఫూర్తితో అభివృద్ధికి పాటుపడాలి : ఎమ్మెల్యే ధనలక్ష్మి

రంపచోడవరం: దేశం కోసం పోరాటం చేసిన త్యాగమూర్తుల స్ఫూర్తితో దేశ సమగ్రాభివృద్ధికి అందరూ పాటుపడాలని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి పిలుపునిచ్చారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో మంగళవారం ఐటీడీఏ ఆధ్వర్యంలో నిర్వహించిన స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల్లో ఎమ్మెల్యే, పీవో సూరజ్‌గనోరే, సబ్ కలెక్టర్ శుభం బన్సల్,ఏఎస్పీ జగదీష్ అడహళ్లి, డీఎఫ్‌వో నరేంథిరన్ జీజీ పాల్గొన్నారు. ఎమ్మెల్యే జాతీయ పతాకాన్ని ఎగురవేసి గౌరవ వందనాన్ని స్వీకరించారు. వివిధ పాఠశాలల విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. విధి నిర్వహణలో ప్రతిభ కనబర్చిన 65 మందికి ఎమ్మెల్యే, పీవో, సబ్ కలెక్టర్ ,ఏఎస్పీ, డీఎఫ్‌వో చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు అందజేశారు. మార్చ్ పాస్ట్‌లో పది పాఠశాలలు పాల్గొన్నారు. వీటిలో మొదటి స్థానంలో రంపచోడవరం ఏపీఆర్ఎస్ (బాలికలు), రెండో స్థానం బందపల్లి ఆశ్రమ హైస్కూల్, మూడవ స్థానం రంపచోడవరం ఏపీఆర్ఎస్ (బాలురు)కు దక్కాయి.ఈ కార్యక్రమంలో ఎంపీపీ బందం శ్రీదేవి, జెడ్పీటీసీ పండా వెంకటలక్ష్మి, వైస్‌ఎంపీపీలు కొమ్మిశెట్టి బాలకృష్ణ, పండా కుమారి, సర్పంచ్ మంగా బొజ్జయ్య అధికారులు పాల్గొన్నారు. స్థానిక ఐటీడీఏ కార్యాలయ ఆవరణలో పీవో సూరజ్ గనోరే జాతీయ జెండాను ఎగురవేశారు. అలాగే సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద సబ్ కలెక్టర్ శుభం బన్సల్, ఏఎస్పీ కార్యాలయం వద్ద ఏఎస్పీ జగదీష్ హడహళ్లి జాతీయ పతకాన్ని ఎగురవేశారు. రంపచోడవరం ఫస్ట్ క్లాస్ జ్యుడీషియల్ కోర్టు వద్ద న్యాయమూర్తి ప్రవీర్‌బాంజ్ జాతీయ జెండాను ఎగురవేశారు.



పాడేరులో జాతీయ జెండాను ఎగురవేస్తున్న మంత్రి అమర్‌నాథ్

చింతూరు ఐటీడీఏలో..

చింతూరు: మండలంలోని స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మంగళవారం స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో ఏవో రాజ్‌కుమార్ జెండాను ఎగురవేశారు. ఏఎస్పీ కార్యాలయంలో ఏఎస్పీ రాహుల్‌మీనా, అటవీ డివిజన్ కార్యాలయంలో డీఎఫ్‌వో పుష్పసౌజన్య, మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ సవలం అమల జెండాలను ఎగురవేశారు. ఎస్టీ కమిషన్ సభ్యుడు చిచ్చడి మురళి, వైస్ ఎంపీపీ మేడేపల్లి సుధాకర్, సర్పంచ్ కారం కన్నారావు పాల్గొన్నారు. స్థానిక గాంధీ విగ్రహం వద్ద జర్నలిస్టుల ఆధ్వర్యంలో స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ ఆయుర్వేద వైద్యుడు జమాల్‌ఖాన్‌ను జర్నలిస్టులు సత్కరించారు.

ఏపీ జెన్‌కో కార్యాలయంలో..

మోతుగూడెం: స్థానిక ఏపీ జెన్‌కో కార్యాలయం ఆవరణలో చీఫ్ ఇంజనీర్ బి శ్రీధర్ జాతీయ జెండాను ఎగురవేశారు.

ప్రజాసేవకు పునరంకితం కావాలి

- కలెక్టర్ సుమిత్‌కుమార్



కలెక్టరేట్‌లో అల్లూరి విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

సాక్షి, పాడేరు : ఎంతో మంది మహానుభావులు ప్రాణాలను పణంగా పెట్టి సాధించిన స్వాతంత్ర్య ఫలాలను అనుభవిస్తూనే ప్రజాసేవకు పునరంకితం అవ్వాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ పిలుపునిచ్చారు. కలెక్టరేట్‌లో ఆయన జాతీయ జెండాను ఆవిష్కరించి గౌరవ వందనం స్వీకరించారు. అల్లూరి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. జేసీ శివశ్రీనివాస్,డీఆర్‌వో అంబేద్కర్, ఎస్‌డీసీ శర్మ పాల్గొన్నారు. పోలీసు కార్యాలయంలో ఎస్పీ తుహిన్‌సిన్హా, ఐటీడీఏ, సబ్‌కలెక్టర్ కార్యాలయంల్లో పీవో అభిషేక్, జీసీసీలో డీఎం సింహాచలం, జిల్లా పంచాయతీ కార్యాలయంలో డీపీవో కొండలరావు, ఐసీడీఎస్‌కార్యాలయంలో పీడీ సూర్యలక్ష్మి, ఎస్‌ఈబీ స్టేషన్లో సీఐ సంతోష్‌కుమార్, ఐసీడీఎస్ కార్యాలయంలో సీడీపీవో ఝాన్సీ, జిల్లా ఆస్పత్రిలో సూపరింటెండెంట్ కృష్ణారావు, ఆర్‌డబ్ల్యూఎస్‌లో ఇన్‌చార్జి ఎస్ఈ లీలాకృష్ణ, ఆర్‌అండ్‌బీ కార్యాలయంలో ఈఈ బాలసుందర బాబు, టీడబ్ల్యూ కార్యాలయంలో ఈఈ రాజు, అటవీ కార్యాలయంలో డీఎఫ్‌వో వినోద్‌కుమార్, అగ్నిమాపక కేంద్రంలో జిల్లా అధికారి శ్రీనివాసు, జిల్లా కార్యాలయంలో డీఎంహెచ్‌వో జమాల్‌బాషా, ఆర్టీసీ డిపోలో డీఎం వి.శ్రీనివాస్, వ్యవసాయ కార్యాలయంలో నందు జాతీయ జెండాను ఆవిష్కరించారు.



చింతూరు ఐటీడీఏలో గౌరవ వందనం సమర్పిస్తున్న సీఆర్పీఎఫ్ జవాన్లు



అరకు సీపహెచ్ స్కూల్లో జాతీయ జెండాకు సెల్యూట్ చేస్తున్న ఎమ్మెల్యే పాల్గుణ, ప్రజాప్రతినిధులు



డీఆర్‌డీఏ పీడీ మురళి, ఇతర అధికారులకు జ్ఞాపిక అందజేస్తున్న మంత్రి అమర్‌నాథ్, కలెక్టర్, పీవో



మల్ల విద్యను ప్రదర్శిస్తున్న కొయ్యూరు, పాడేరు ఆశ్రమ విద్యార్థులు



థింసా నృత్యంతో సందడి చేస్తున్న డ్వాక్రా మహిళలు



పాడేరులో ద్వితీయ స్థానం పొందిన వ్యవసాయ, ఉద్యానవన శాఖల శకటం



పాడేరు శ్రీకృష్ణాపురం గిరిజన విద్యాలయం విద్యార్థుల నృత్యరూపకం



పాడేరు నిర్వహించిన వేడుకల్లో ఫైర్ జంప్ చేస్తున్న తలారిసింగి విద్యార్థులు



చింతపల్లి మండలంలో పండుపడాల్ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న కుటుంబ సభ్యులు



రంపచోడవరం ఐటీడీఏ వద్ద జాతీయజెండాను ఎగురవేస్తున్న పీవో సూరజ్ గనోరే



మోతుగూడెంలో జాతీయ జెండాను ఎగురవేస్తున్న ఏపీ జెన్‌కో సీఈ శ్రీధర్

జనం లేరా..? వెయిట్ చేయండి..

- పార్టీ శ్రేణులపై చంద్రబాబు అసహనం
- జన సమీకరణకు నానాయాతన పడిన నాయకులు
- బాబు యాత్రతో బీచ్‌లో ఇబ్బందులు పడ్డ సందర్శకులు
- విజన్ పేరుతో మరో మోసానికి తెర తీసిన చంద్రబాబు
- ప్రశ్నలడిగేవారిని ప్రత్యేకంగా నియమించిన వైనం



ప్రతిజ్ఞ చేస్తున్న టీడీపీ కార్యకర్తలు

సాక్షి, విశాఖపట్నం: 'ఏందయ్యా ఇది.. ముందే చెప్పాను కదా.. అయినా జనాల్ని తీసుకురాలేకపోయారా.? త్వరగా బీచ్ రోడ్ నింపండి. అప్పుడే చెప్పండి.. బయటికి వస్తాను...' పార్టీ నాయకులపై టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు గరం గరమయ్యారు. ఇండియా విజన్–2047 కార్యక్రమం పేరుతో మరో మోసపూరిత కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు చంద్రబాబు మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు విశాఖ చేరుకున్నారు. సాయంత్రం 4 గంటలకు బీచ్ రోడ్డులోని ఎన్టీఆర్ విగ్రహం నుంచి పాదయాత్రగా ప్రారంభం కావాలి. కానీ.. నోవాటెల్ లో బసచేసిన చంద్రబాబు.. అక్కడకి జనం రాలేదని తెలుసుకొని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక నాయకుల్ని పిలిచి.. జన సమీకరణకు ఇంకా ఎంతసేపు టైం కావాలని అసహనం వ్యక్తం చేశారు. జనం నిండిన తర్వాతే వస్తానని చెప్పడంతో నేతలు హడావుడిగా పార్టీ శ్రేణులతో రోడ్డు నింపారు. అనంతరం తాపీగా బయటికి వచ్చిన బాబు.. గంటన్నర ఆలస్యంగా పాదయాత్ర మొదలు పెట్టారు.

సందర్శకులకు ఇబ్బందులు

స్వాతంత్య్ర దినోత్సవం రోజున సందర్శకులు భారీగా బీచ్‌కు వచ్చారు. అయితే.. చంద్రబాబు కార్యక్రమం కారణంగా ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. సాయంత్రం 4 తర్వాత యథావిధిగా రాకపోకలు సాగిస్తామని పోలీసులు పర్యాటకులకు సర్ది చెప్పారు. కానీ చంద్రబాబు ఆలస్యంగా మొదలు పెట్టడంతో సందర్శకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సెలవు రోజున ఇలా ఇబ్బంది పెట్టే కార్యక్రమాలేంటంటూ స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

పల్లా.. ఫొటోలకు ఎరేంజ్ చెయ్...

పాదయాత్రగా వెళ్తున్న బాబుతో ఫొటోలు దిగేందుకు స్థానికులెవ్వరూ రాకపోవడంతో ఆయన విస్తుపోయారు. వెంటనే స్థానిక నేత పల్లా శ్రీనివాసరావుని పిలిపించి.. పాదయాత్ర చప్పగా సాగుతోందనీ.. విభిన్న వర్గాల వారు వచ్చి ఫొటోలు తీసుకునేలా ఎరేంజ్ చేయాలని హుకుం జారీ చేశారు. వెంటనే పల్లాతో పాటు ఇతర నాయకులు అదే పనిలో నిమగ్నమయ్యారు. ఒక లాయర్, ముస్లిం మహిళ, స్టూడెంట్.. ఇలా ఒక్కొక్కర్ని పిలిపించి చంద్రబాబుతో ఫొటోలు దిగేలా చేసి.. పక్కకు తోసేశారు.

మరో మోసపూరిత డాక్యుమెంటా.?

ప్రతిసారీ విజనరీ పేరుతో హడావుడి చేసే చంద్రబాబు.. ఈ ఎన్నికల ముందు కూడా అదే పల్లవి అందుకున్నారు. గతంలో విజన్–2020 పేరుతో జనాల్ని మభ్యపెట్టిన బాబు.. ఇప్పుడు విజన్–2047 పేరుతో డాక్యుమెంట్ విడుదల చేశారు. 2019 ఎన్నికల్లో ఓటమి పాలైన బాబు... తన వద్ద సలహాదారులుగా వ్యవహరించిన వారితో కలిసి.. బాబు చైర్మన్‌గా గ్లోబల్ ఫోరం ఫర్ సస్టైనబుల్ ట్రాన్స్‌ఫర్మేషన్(జీఎఫ్ఎస్‌టీ) పేరుతో సంస్థ ప్రారంభించారు. సదరు సంస్థ రూపొందించిన డాక్యుమెంటే ఇది. ఈ కార్యక్రమానికి వచ్చిన కొందరు విద్యావేత్తలు, నాయకులు చంద్రబాబు హడావుడి చూసి నవ్వుకున్నారు.

ఢిల్లీకి ఫుల్ డిమాండ్!

- రెండ్రోజుల ముందు టికెట్లు దొరకని పరిస్థితి
- ఆ తర్వాత ముంబై విమానాలకు గిరాకీ
- 90 శాతానికి పైగా ఆక్యుపెన్సీ రేషియో
- అంతర్జాతీయ కనెక్టివిటీ ఉండడమే కారణం

సాక్షి, విశాఖపట్నం: విశాఖపట్నం–ఢిల్లీల మధ్య నడిచే విమానాలకు ఫుల్ డిమాండ్ ఉంటోంది. మరే విమాన సర్వీసుకు లేని ప్రయాణికుల తాకిడి వీటికి కనిపిస్తోంది. ఈ రెండు నగరాల మధ్య రోజుకు ఐదు సర్వీసులు నడుస్తున్నాయి. ఇవి ఉదయం 8.15 నుంచి రాత్రి 9.50 గంటల వరకు తిరుగుతున్నాయి. వీటిలో సీట్లు 95 శాతానికి పైగా నిండుతున్నాయి. ఒక్కోసారి ఆక్యుపెన్సీ రేషియో (ఓఆర్) 100 శాతం కూడా ఉంటోంది. ఈ పరిస్థితుల్లో విశాఖపట్నం నుంచి ఢిల్లీ వెళ్లేందుకు రెండు రోజుల ముందుగా టికెట్లు దొరకడం లేదు. ఆ తర్వాత స్థానం విశాఖపట్నం–ముంబై విమాన సర్వీసులకు ఉంది. ఈ రెండు నగరాల మధ్య 90 శాతం పైగా ఓఆర్ ఉంటోంది. ఈ విమాన సర్వీసులకు కూడా ఒకట్రెండు రోజుల ముందుగా టికెట్లు లభించని పరిస్థితి ఉంది. ఇక విశాఖపట్నం–సింగపూర్ సర్వీసుకు కూడా మంచి గిరాకీ కనిపిస్తోంది.

ఈ విమాన సర్వీసుకు 80 శాతం వరకు ఆక్యుపెన్సీ కనిపిస్తోంది. విశాఖపట్నం అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి సింగపూర్‌కు ఒక్క ఇంటర్నేషనల్ సర్వీసు మాత్రమే నడుస్తోంది. అందువల్ల ఇతర దేశాలకు వెళ్లాలంటే విశాఖ నుంచి నేరుగా విమానాలు లేవు. ఢిల్లీ, ముంబైల నుంచి ప్రపంచంలోని పలు దేశాలకు కనెక్టివిటీ ఉంది. దీంతో ఇక్కడ నుంచి డొమెస్టిక్ సర్వీసుల్లో ఢిల్లీ, ముంబైలకు వెళ్లి అక్కడ నుంచి ఆయా దేశాలకు విమానాల్లో చేరుకుంటున్నారు. ఫలితంగా ఈ విశాఖ విమానాశ్రయం నుంచి దేశ రాజధాని ఢిల్లీ, ఆర్థిక రాజధాని ముంబైలకు వెళ్తున్న వారి సంఖ్య పెరుగుతోంది. ప్రధానంగా ఉమ్మడి ఉభయ గోదావరి, ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి ఉద్యోగ, వ్యాపార అవసరాలతో పాటు పర్యాటకంలో భాగంగా పెద్ద సంఖ్యలో విదేశాలకు రాకపోకలు సాగించే వారున్నారు. దీంతో ఈ నగరాల మధ్య ప్రయాణికుల రద్దీ పెరగడానికి దోహదపడుతోంది. విశాఖ విమానాశ్రయం నుంచి రాకపోకలు సాగించే విమానాల్లో ఢిల్లీ, ముంబై సర్వీసులకు అధిక డిమాండ్ ఉండడానికి ఇదే కారణమని ఎయిర్‌పోర్టు డైరెక్టర్ ఎస్. రాజారెడ్డి 'సాక్షి'కి చెప్పారు. మరోవైపు విశాఖపట్నం విమానాశ్రయం నుంచి ప్రయాణికుల రద్దీకనుగుణంగా తగినన్ని సర్వీసులు పెంచేందుకు విమానాల కొరత ఉందని విమానయాన నిపుణులు చెబుతున్నారు.





ఉత్తమ సేవలకు ప్రశంసలు

సాక్షి,పాడేరు: స్వాతంత్య్ర దినోత్సవం పురస్కరించుకుని జిల్లాలోని ఉత్తమ సేవలు అందించిన అధికారులు,ఉద్యోగులు,పోలీసులు,వివిధ విభాగాల సిబ్బంది, సంఘ సేవకులను జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ ఎంపిక చేశారు. వీరికి జిల్లా ఇన్‌చార్జి మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ప్రశంసాపత్రాలను పాడేరులో జరిగిన వేడుకల్లో అందజేశారు.

మంత్రి అమర్‌నాథ్ చేతులమీదుగా ప్రశంసాపత్రం అందుకుంటున్న డాక్టర్ నరసింగరావు, డీఎంహెచ్‌వో జమాల్‌బాషా, డీఆర్వో అంబేడ్కర్, ఎస్‌డీసీ శర్మ, ఉప్ప వైద్యాధికారి అనూష, కూనవరం తహసీల్దార్ అనసూయ, వీఆర్‌పురం తహసీల్దార్ శ్రీధర్, రాజవొమ్మంగి తహసీల్దార్ సుబ్రహ్మణ్యచారి, టీడబ్ల్యూ ఈఈ రాజు, గిరిజన మ్యూజియం మేనేజర్ మురళి, పద్మాపురం గార్డెన్ మేనేజర్ బొంజుబాబు, గురుకులం కోఆర్డినేటర్ మూర్తి, ఐటీడీఏ ఏపీవో వెంకటేశ్వరరావు, ఐటీడీఏ ఏవో హేమలత, సీనియర్ జర్నలిస్ట్ రామచంద్రరావు, కలెక్టర్ సీసీ ఎస్‌కే బాషా, కలెక్టర్ సీసీ చంద్రశేఖర్, ఏటీడబ్ల్యూవో మల్లికార్జునరావు, కొయ్యూరు సీఐ స్వామినాయుడు, జి.కే.వీధి సీఐ అశోక్‌కుమార్, పాడేరు ఎస్‌ఐ రంజిత్‌కుమార్, అడ్డతీగల ఎస్‌ఐ అప్పలరాజు, చింతూరు ఎంపీడీవో వెంకటరత్నం, పాడేరు సీడీపీవో ఝాన్సీరాణి, సీడీపీవో విజయకుమారి, సూపర్‌వైజర్ ఉర్మిళ, సంఘసేవకురాలు కంబిడి కృష్ణకుమారి, వెలుగు ఏపీఎం రమణికుమారి, డీసీడీవో సూర్యకుమారి, సమాచారశాఖ అటెండర్ వరలక్ష్మి, దేవీపట్నం ఎస్‌ఐ నాగార్జున, దేవీపట్నం తహసీల్దార్ సత్యనారాయణ, ముంచంగిపుట్టు వైద్యాధికారిణి మౌనిక, వై.రామవరం ఎస్‌బీ హెచ్‌సీ రాజారావు

ప్రకృతి అందాలు అద్భుతం

- మంత్రి అమర్‌నాథ్
- బొర్రాగుహల సందర్శన

అనంతగిరి: మండలంలోని ప్రముఖ పర్యాటక కేంద్రమైన బొర్రా గుహల వద్ద ప్రకృతి అందాలు అద్భుతమని రాష్ట్ర పరిశ్రమలు,ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన కుటుంబ సమేతంగా తిలకించారు.గోస్తనీ నదిపై ఏర్పాటు చేస్తున్న రోప్‌వే పనులను పరిశీలించారు. గుహలను తిలకించారు. యువజనవిభాగం రాష్ట్ర కార్యదర్శి చెట్టి వినయ్, అరకు మార్కెట్‌కమిటీ చైర్మన్ కిల్లో రాజారమేష్, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు కిరణ్, మండల కార్యదర్శి డానియేలు పాల్గొన్నారు.

గుండెపోటుతో వీఆర్‌ఏ మృతి



చెట్టి పోలయ్య (ఫైల్)

ముంచంగిపుట్టు: మండలంలోని దారెల పంచాయతీ కేంద్రంలో వీఆర్‌ఏగా పనిచేస్తున్న చెట్టి పోలయ్య(41)గుండె పోటుతో మృతి చెందారు.సోమవారం అర్ధరాత్రి 12 సమయంలో తీవ్రమైన గుండె నొప్పి రావడంతో పోలయ్యను ఆస్పత్రికి తీసుకు వెళ్లే లోపే ఇంటి వద్దే మరణించారు. పోలయ్య మృతిపై తహసీల్దార్ నర్సమ్మ,రెవెన్యూ సిబ్బంది సంతాపం వ్యక్తం చేశారు.

ఆదివాసీలు దేవుళ్లతో సమానం

ఎమ్మెల్యే పాల్గుణ

అరకులోయటౌన్: గిరిజన ప్రాంతంలో నివసిస్తున్న ఆదివాసీలు దేవుళ్లతో సమానమని అరకులోయ ఎమ్మెల్యే శెట్టి పాల్గుణ అన్నారు. పద్మాపురం పంచాయతీ రణజిల్లెడ సమీపంలోని ఆసరా స్వచ్ఛంద సంస్థ కార్యాలయం వద్ద రణజిల్లెడ పరిసరాల గ్రామాల్లోని వందమంది వృద్ధులకు సంస్థ వ్యవస్థాపకుడు అబీబ్ సుల్తాన్ ఆలీ ఆధ్వర్యంలో అన్నదానం చేసి, రగ్గులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గుణ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. స్వచ్ఛంద కార్యక్రమాలకు సహకారం ఉంటుందని చెప్పారు. అంతకు ముందు సంస్థ ప్రతినిధులు ఎమ్మెల్యేకు దుశ్శాలువా కప్పి, జ్ఞాపిక అందజేసి సత్కరించారు. సంస్థ ప్రతినిధి డాక్టర్ పి.రత్నరాజు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కొర్రా గాసి, మార్కెట్ కమిటీ చైర్మన్ రాజ రమేష్, సర్పంచ్ సుస్మిత, ఎంపీటీసీ భీమరాజు, దురియా ఆనంద్, శత్రుఘ్న, నాయకులు ఎల్.బి. కిరణ్, ముఖీ సాంబ, సుబ్రయ్య, శెట్టి లక్ష్మణ్‌రావు, గంగులు, యాసిన్, తదితరులు పాల్గొన్నారు.

ఓవర్ లోడుతో బెంబేలెత్తించిన లారీ



అచ్యుతాపురం కూడలిలో లారీలను ఆపిన పోలీసులు



జారిపడే స్థితిలో ఉన్న రాళ్ల లోడుతో లారీ

అచ్యుతాపురం (అనకాపల్లి): అనకాపల్లి–అచ్యుతాపురం మార్గంలో రాత్రి వేళల్లో పరిశ్రమల ఉత్పత్తులతోపాటు, ముడి సరుకుల కోసం పరిమితికి మించిన లోడుతో లారీలో రవాణా జరుగుతోంది. సోమవారం రాత్రి పెద్ద పెద్ద రాళ్లతో వెళ్తున్న లారీ.. వాహనదారులను బెంబేలెత్తించింది. లారీ పైభాగంలో జారిపోయే స్థితిలో ఉన్న రాళ్లు, వాహన లోడ్‌పై డీవైఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు చింతకాయల శివాజీ, సీఐటీయూ మండల కన్వీనర్ సోమునాయుడు ఫోన్‌లో పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు వాహనాలను ఆపి, వారికి సూచనలిచ్చారు. భవిష్యత్‌లో ఇలాంటి పరిణామాలు జరిగితే కఠిన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు.

నషా ముక్త్ భారత్ ప్రారంభం



నషా ముక్త భారత్‌ను బ్యానర్ ఆవిష్కరిస్తున్న మంత్రి అమర్‌నాథ్

సాక్షి, పాడేరు: మాదక ద్రవ్యాల రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు అందరూ కృషి చేయాలని రాష్ట్ర, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి గుడివాడ అమర్‌నాథ్ తెలిపారు.సాతంత్య్ర దినోత్సవ కార్యక్రమాల అనంతరం మంత్రి నషా ముక్త్ భారత్‌ను ప్రారంభిస్తూ బ్యానర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమం ద్వారా జిల్లాను మాదక ద్రవ్య రహితంగా మార్చేందుకు కృషి జరుగుతుందని చెప్పారు. వలంటీర్లకు శిక్షణ ఇచ్చి అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, కలెక్టర్ సుమిత్ కుమార్, ఎస్పీ తుహీన్ సిన్హ, ఐటీడీఏ పీవో అభిషేక్ తదితరులు పాల్గొన్నారు.

సెల్ టవర్ పనులు ప్రారంభం

జి.మాడుగుల: మండలంలో లువ్వాసింగి పంచాయతీ తియ్యగుండంలో ఎంపీటీసీ సభ్యుడు గబ్బాడి సన్యాసిదొర మంగళవారం బీఎస్ఎన్ఎల్ సెల్ టవర్ నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల నాయకుడు కొండపల్లి సత్యనారాయణ, మాజీ సర్పంచ్ జి.పండుదొర,ఉప సర్పంచ్ గణపతి, వెల్ఫేర్ అసిస్టెంట్ తమర్భ శివపాడల్ టీపీ కోటేశ్వరరావు, గృహసారథులు చంటిబాబు, నీలకంఠం పాల్గొన్నారు.

పాముకాటుకు రైతు మృతి

రావికమతం: మండలంలోని టి.అర్జాపురం గ్రామానికి చెందిన యాదగిరి అచ్చిబాబు(65) పాము కాటుకు గురై మంగళవారం సాయంత్రం మృతి చెందాడు. గొర్రెలను మేతకు తోలుకెళ్తుండగా, శాస్త్రిగారి మామిడి తోటకు సమీపంలో పాము కాటుకు గురయ్యాడు. అక్కడికక్కడే పడిపోయాడు. సమీప రైతులు గమనించి పరిశీలించగా అప్పటికే మృతి చెందడంతో బంధువులకు సమాచారం అందించారు. మృతుడికి భార్య, నలుగురు పిల్లలు ఉన్నారు.

జూలైలో స్టీల్‌ప్లాంట్ రూ.1,927 కోట్ల రికార్డు టర్నోవర్



ప్రసంగిస్తున్న స్టీల్‌ప్లాంట్ సీఎండీ అతుల్ భట్

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌లో స్వాతంత్య్ర దినోత్సవంలో భాగంగా ఉక్కు త్రిష్టా మైదానంలో జరిగిన కార్యక్రమంలో స్టీల్‌ప్లాంట్ సీఎండీ అతుల్ భట్ జెండా ఎగురవేసి సీఐఎస్ఎస్ సిబ్బంది గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ జూలైలో రూ.1,927 కోట్ల రికార్డు టర్నోవర్ సాధించామన్నారు. ఈనెలలో మూడో బ్లాస్ట్‌ఫర్నేస్ పునఃప్రారంభించేందుకు కృషి చేస్తున్నామన్నారు. స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్లు డి.కె. మహంతి, ఎ.కె.బాగ్చీ, ఎస్.సి.పాండే, చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ డాక్టర్ ఎస్.కరుణరాజు, వీఎంఎస్ అధ్యక్షురాలు నుపూర్ భట్, సీఐఎస్ఎఫ్ కమాండెంట్ అక్తార్ మహ్మద్ హనీఫ్‌తో పాటు వివిధ కార్మిక సంఘాలు, అసోసియేషన్ల నాయకులు పాల్గొన్నారు.

సమాజ చైతన్యానికి నాటక రంగం దోహదం





కొరడా నాటికలోని సన్నివేశాలు

- కళా రంగానికి గ్రామీణ యువజన మందిరం సేవలు అభినందనీయం
- వైఎస్సార్ సీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ

మునగపాక: కళారంగాన్ని బ్రతికించడంలో గ్రామీణ యువజన మందిరం అందిస్తున్న సేవలు అభినందనీయమని వైఎస్సార్‌సీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ కొనియాడారు. గ్రామీణ యువజన మందిరం 57వ వార్షికోత్సవంలో భాగంగా ఏర్పాటు చేసిన నాటిక ప్రదర్శనలను ఆయన మంగళవారం రాత్రి జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కనుమరుగైపోతున్న నాటక రంగాన్ని పోత్సహించడంలో గత కొన్నేళ్లుగా యువజన మందిరం అందిస్తున్న సహకారం మరువలేనిదన్నారు. సమాజానికి మేలు చేకూర్చే, చైతన్యం కలిగించే నాటికలు, నాటకాలు రావాల్సిన అవసరం ఉందన్నారు. వార్షికోత్సవం సందర్భంగా ఏటా నాటిక ప్రదర్శనలు నిర్వహించడం అభినందనీయమన్నారు. యువజన మందిరం గౌరవ అధ్యక్షుడు సూరిశెట్టి రాము అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ మళ్ల జయలక్ష్మి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు, సర్పంచ్ దిమ్మల అప్పారావు, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు దాడి ముసిలినాయుడు, ఎంపీటీసీ బోడకుర్తి గణేష్, పార్టీ అధికార ప్రతినిధి ఆడారి కాశిబాబు, పెద్దలు సూరిశెట్టి కన్నారావు, కాండ్రేగుల జగ్గారావు, పెంటకోట గిరిబాబు, అలంక సూర్యప్రకాశరావు, సాంస్కృతిక విభాగం డైరెక్టర్ పెంటకోట విజయ్, కార్యదర్శి ఆడారి సోమశేఖర్, ఉపాధ్యక్షుడు దాడి అప్పలనాయుడు, కోశాధికారి దాడి సాంబశివ పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న నాటిక ప్రదర్శనలు

గ్రామీణ యువజన మందిరం వార్షికోత్సవంలో భాగంగా మంగళవారం రాత్రి నందీశ్వర తులసీ వేదికపై ప్రదర్శించిన నాటికలు అందరినీ ఆకట్టుకున్నాయి. హైదరాబాద్‌కు చెందిన సిరిమువ్వ కల్చరల్ వారు ప్రదర్శించిన కొరడా నాటిక అందరినీ అలరించింది. నాటికలోని నటీనటులు మెరుగైన ప్రదర్శన ఇచ్చారు. నాటికకు శ్రీ మంజునాథ రచన, దర్శకత్వం వహించారు. ద్వితీయ ప్రదర్శనగా హక్కు నాటిక ఆలోచనలిన రేకెత్తించింది. మునగపాకకు చెందిన యువ రచయిత ఆడారి సోమశేఖర్ రచించిన ఈ నాటికకు శ్రీ మంజునాథ దర్శకత్వం వహించారు. నాటిక ప్రదర్శనలను తిలకించేందుకు ప్రేక్షకులు భారీగా తరలివచ్చారు.

క్షణికావేశం ప్రాణం తీసింది

- అష్టాచమ్మ ఆటలో ఇద్దరు స్నేహితుల మధ్య ఘర్షణ
- నెట్టేయగా సిమెంట్ అరుగు తలకు తగిలి ఒకరి మృతి
- పిఠాపురం కాలనీలో ఘటన



నారాయణరావు మృతదేహం



నారాయణరావు ఫైల్

ఎంవీపీకాలనీ(విశాఖ): మద్దిలపాలెం పిఠాపురం కాలనీలో ఇద్దరి యువకుల మధ్య జరిగిన ఘర్షణ ఒకరి ప్రాణం తీసింది. అప్పటి వరకు కలిసి అష్టాచమ్మ ఆడిన ఆ యువకులు ఆటలో తలెత్తిన చిన్నపాటి వివాదంతో దాడి చేసుకున్నారు. దీంతో నారాయణరావు (28) అనే యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనపై ఎంవీపీ సీఐ మల్లేశ్వరరావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గవరవీధి, ఆటోమోటివ్ ప్రాంతానికి చెందిన దవిల నారాయణరావు (28), మద్దిలపాలెం పిఠాపురం కాలనీకి చెందిన ఆర్.రాంబాబు (29) ఇద్దరూ స్నేహితులు. వివాహితుడైన రాంబాబు కారు డ్రైవర్‌గా పనిచేస్తుండగా అవివాహితుడైన నారాయణరావు పెయింటింగ్ పనులు చేస్తూ జీవిస్తున్నాడు. మంగళవారం మధ్యాహ్నం వీరిద్దరూ పిఠాపురం కాలనీ మార్కెట్ సెంటర్ సమీపంలో బెట్టింగ్‌కు అష్టాచమ్మా ఆడారు. ఈ క్రమంలో వారిద్దరి మధ్య గొడవ చోటుచేసుకుంది. అష్టాచమ్మా పిక్కలను నారాయణరావు తన్నేయడంతో కోపానికి గురైన రాంబాబు అతని మోహంపై బలంగా కొట్టాడు. దీంతో వెనక్కిపడిపోయిన నారాయణరావుకు అక్కడి సిమెంట్ అరుగు తల వెనుక బలంగా తగలడంతో మరణించినట్లు సీఐ మల్లేశ్వరరావు వెల్లడించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. నిందితుడు రాంబాబు కోసం పోలీసులు గాలిస్తున్నారు. అయితే నారాయణరావుకు తల వెనుక గాయమైనట్లు పోలీసులు వెల్లడిస్తున్నప్పటికీ ఒంటిమీద ఎలాంటి గాయాలు లేకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది.

ఆటో ప్రమాదంలో గాయపడిన మహిళ మృతి



ఆటో ప్రమాదంలో మృతి చెందిన లక్ష్మి

రోలుగుంట : వడ్డాది–నర్సీపట్నం ఆర్‌అండ్‌బీ రోడ్డులో నర్సీపట్నం వెళుతున్న ఆటో నిండుగొండ సమీపంలో గల సాయిబాబా గుడి వద్ద సోమవారం రాత్రి బోల్తాపడిన ప్రమాదంలో ఒకరు తీవ్రంగా గాయపడగా, మరో ముగ్గురు స్వల్పంగా గాయపడ్డారు. స్థానికుల సమాచారంతో 108లో వారిని నర్సీపట్నం తరలించారు. వీరిలో తీవ్రంగా గాయపడిన కొంతలం గ్రామానికి చెందిన మలిసెట్ల లక్ష్మి(40)కి నర్సీపట్నం ఏరియా ఆసుపత్రిలో ప్రథమ చికిత్స చేసి, మెరుగైన వైద్యం కోసం విశాఖ తరలిస్తుండగా మార్గ మధ్యంలో మృతి చెందింది. మృతురాలి అల్లుడు కేశంసెట్టి నాగేష్ ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ బి.నాగకార్తీక్ కేసు నమోదు చేసి మృతదేహానికి పంచనామా చేసి, పోస్టుమార్టంకు తరలించారు. మృతురాలికి భర్త, ఇద్దరు ఆడపిల్లలున్నారని తెలిపారు. స్వల్పంగా గాయపడిన రావికమతం మండలం కొత్తకోటకు చెందిన అయితి లక్ష్మి(30), పి.రమణమ్మ(40), ఎస్.లక్ష్మి(42) నర్సీపట్నం ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని ఎస్‌ఐ విలేకరులకు తెలిపారు.

ఉమ్మలాడలో చోరీ

మునగపాక : మండలంలోని ఉమ్మలాడలో మంగళవారం మూడు తులాల బంగారు ఆభరణాలు చోరీకి గురయ్యాయి. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ మహమ్మద్ అలీ షరీఫ్ కేసు నమోదు చేశారు. వివరాలిలా ఉన్నాయి. ఉమ్మలాడ ప్రాథమిక పాఠశాల సమీపంలో తాళ్లబట్టు పార్వతీదేవి నివాసం ఉంటున్నారు. నర్సీపట్నంలో ఉంటున్న తన మనువడు పుట్టిన రోజుకు సాయంత్రం వెళ్లేందుకు తన హ్యాండ్ బ్యాగ్‌లో మూడు తులాల బంగారు ఆభరణాలతో పాటు కొంత నగదును ఉంచారు.

ఉదయం పక్కనే ఉంటున్న కుమారుని ఇంటికి వెళ్లి తిరిగి రాగా బ్యాగ్‌లోని బంగారు ఆభరణాలు కనిపించకపోవడంతో ఆందోళనకు గురై మునగపాక పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ అలీ సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. క్లూస్‌టీమ్ కూడా వివరాలు సేకరించింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

కంటి ఆస్పత్రికి నేత్ర దానం



నేత్రాలను ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆస్పత్రికి అప్పగిస్తున్నట్టు ఆమోద పత్రం అందజేస్తున్న కుటుంబ సభ్యులు

అక్కిరెడ్డిపాలెం(విశాఖ):భెల్ టౌన్‌షిప్‌లో నివసిస్తున్న సంస్థ కార్మికుడు మాడుతూరి నర్సింగరావు (53) సోమవారం ఆత్మహత్యకు పాల్పడడంతో ఆయన నేత్రాలను ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆస్పత్రికి కుటుంబ సభ్యులు అందించారు. మృతదేహానికి మంగళవారం కేజీహెచ్‌లో పోస్టుమార్టం నిర్వహించే సమయంలో నర్సింగరావు మిత్రులు, భెల్ కార్మికులైన ఆల్సి అప్పలనారాయణ, కె.శ్రీనివాసరావు ప్రేరణతో మృతుని భార్య జయంతి, కుమార్తె అనుమతి మేరకు నేత్రాలను కంటి ఆస్పత్రికి అప్పగించారు. నర్సింగరావు మృతికి పలువురు సంతాపం తెలిపారు.

ముగిసిన పారాబ్యాడ్మింటన్ పోటీలు



పాల్గొన్న పారా బ్యాడ్మింటన్ క్రీడాకారులు

విశాఖ స్పోర్ట్స్: విశాఖ రైల్వే స్టేడియం బ్యాడ్మింటన్ ఎన్‌క్లేవ్‌లో మంగళవారం పారాబ్యాడ్మింటన్ పోటీలు ఉత్సాహంగా సాగాయి. సింగిల్స్, డబుల్స్, మిక్స్‌డ్ డబుల్స్ విభాగాల్లో పలువురు పారా క్రీడాకారులు పోటీపడ్డారు. వీల్‌చైర్ అంశంలోనూ పారా బ్యాడ్మింటన్ ఆటగాళ్లు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఆయా కేటగిరిల్లో విజేతలుగా నిలిచిన వారు రాష్ట్ర జట్టుకు ఎంపిక కానున్నారు. పారాస్పోర్ట్స్ సంఘం ఆధ్వర్యంలో కేఆర్‌ఎస్ ఫౌండేషన్, వీరుమామ ఈవెంట్స్ సంయుక్త ఆధ్వర్యంలో పోటీలు జరిగాయి. మాజీ ఎంపీ రవీంద్రబాబు హాజరై జెండా వందనం చేసి పోటీలను ప్రారంభించారు.